# అణుబాంబు

గాంగేయుడు గాంధేయుడు. ఒక మంచికోసం శ్రేయస్సుకోసం ఎవరైనా అబద్ధాలాడవచ్చునన్న సిద్ధాంతం అతన్ది. మానవులలో మహాత్మాగాంధీ, దైవాలలో శ్రీ వేంకటేశ్వరస్వామి అతనికి ఆరాధ్యులు. ప్రతి శనివారం ఉషోదయానలేచి షాంపూతో తలకు స్నానంచేస్తూ శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం చదువుతూంటాడు.

"కౌసల్యా సుప్రజా రామా పూర్వా సంధ్యా ప్రవర్తతే ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవ మాహ్నికమ్" ఈ చరణం కౌసల్యాపుత్రుడు, సీతా పతి అయిన రాముణ్ణి ఉద్దేశించి రాయ బడింది. ఒకమాట ఈనోటా ఆనోటా ప్రాకి అర్థం మారిపోయినట్టు ఈశ్లోకం కూడా ఈనోటా ఆనోటా మారి ఎవర్ని గురించి వ్రాయ బడిందో అన్న అర్థంపోయి అనర్థం అయి వేంకటేశ్వర్లుకి నప్పించ బడింది.

తిరుమలలో వేంచేసి ఉన్న ఆ శ్రీ వేంకటేశ్వర స్వామిని ఆ బాలాజీని, శ్రీదేవీ భూదేవీలకు భర్త అయిన ఆ శ్రీనివాసుణ్ణి దర్శనం చేసుకోవాలని, భక్తపరమాణువైన గాంగేయుడికి తపన కలగడంలో ఆశ్చర్యం ఏముంది?

శైవ మిత్రుడైన బాలేందుధరాన్ని తిరుపతి వెళ్ళడాన్కి ఒక పాసు ఇప్పించమన్నాడు గాంగేయుడు.

"ఎంత దేవదర్శనానికైతే మాత్రం దొంగపాసుమీద ప్రయాణం చేయడం తప్పుకాదట్రా గాంగేయా? రైల్వేవారు యాత్రికుల సౌకర్యార్థం సర్క్యులర్ టిక్కెట్లు జారీ చేస్తున్నారు. ఎంతో చౌక, అలా సర్క్యులర్ టిక్కెట్ తీసుకున్నావంటే ఒక్క తిరుపతే ఖర్మమేమి? కన్యాకుమారి, రామేశ్వరం, మధుర చిదంబరం, శ్రీరంగం వంటి మిగిలిన

క్షేత్రాల్ని కూడా దర్శించవచ్చు. ఎన్నెక్కువ పుణ్య క్షేత్రాలు దర్శనం చేస్తే అంతెక్కువ పుణ్యం సంపాదిస్తావు. అధికస్య అధికం ఫలం" సలహా చెప్పాడు బాలేందుధరం.

"చాల్లేరా చెప్పొచ్చావు నీకు ఉచితంగా పాసు ఇవ్వాలనుంటే ఇయ్యి. ఉచితంగా సలహాలు మాత్రం ఇవ్వకు. దైవదర్శనం కోసం వెళ్ళినప్పుడు, ఏ తప్పుపని చేసినా ఫరవాలేదు. అన్నింటికీ ఆ ఆపదమొక్కులవాడే ఉన్నాడు. గోవిందా! .... ఓఓ ..... విందా!" అని అంజలి ఘటించాడు గాంగేయుడు.

బాలేందుధరం కూడా సెంటిమెంటలిస్టే. పాపభీతి గలవాడే. ఓ పాసు తీసుకుని గాంగేయుడి కిచ్చేసి పదిహేను రోజులు సెలవు పెట్టి ఇంట్లో కూర్చున్నాడు.

"టిక్కెట్ ప్లీజ్" ఠక్కున తీసిచ్చాడు గాంగేయుడు.

పాసుని ఎగాదిగా చూస్తూ గాంగేయుడి ముఖం చూశాడు టీటీయీ.

"మీ పేరు?"

"గాం....." అనబోయి మళ్లా సద్దుకుని - "బాలేందుధరం" అన్నాడు.

"నాకు డౌట్‌గా వుంది. దయ చేసి కిందకి దిగండి. ఎన్‌క్వయిరీ పూర్తయేక మళ్లా ప్రయాణం చేద్దురు గాని"

"ఓ యస్ పదండి" అంటూ కిందకిదిగేడు గాంగేయుడు ధీమాగా.

గాంగేయుడు ఆ వేంకటేశ్వర స్వామి మీద భారంవేసి, గొప్ప ధైర్యంగా ఉన్నాడు. అసలే వేంకటేశ్వర స్వామికి ఆపద మొక్కుల వాడనే పేరుంది.

అలనాడు ఆపదలో "నీవే తప్ప ఇత పరం బెరుగ" అన్న గజేంద్రుణ్ణి రక్షించలేదూ?

రాజసభలో చీరలు విప్పి అవమానింప బోయినప్పుడు లీనాంగియై ద్రౌపది కుయ్యిడగా. " కారుణ్యంబున భూరి వస్త్రకలితను" చేయలేదా?

ఆ ఏడు కొండల వాడికి "దీన బంధువు" అనే బిరుదు కూడా ఉంది. గాంగేయుడు దీనుడు కనుకే, అతవికి ఆ సప్తగిరి వాసునితో బంధుత్వం ఏర్పడింది. తనవిప్పుడు ఆ తిరుమలవాసుడు ఆదుకుని బాంధవ్యాన్ని నిలుపుకోవలసిన అవసరం వుంది. లేకపోతే మనతో స్వామివారికి బంధుత్వం తెగిపోయి దీనబంధువనే బిరుదు రద్దయిపోదూ?

టీటీయీ ఎన్‌క్వయిరీ కండక్టు చెయ్యగా పాసుహోల్డరయిన గాంగేయుడు బాలేందుధరం కాదని తేలింది.

అసలు బాలేందుధరానికి ఉద్యోగం నుండి ఉద్వాసనా, నకిలీ బాలేంధుధరం అయిన గాంగేయుడికి కటకటాల రుద్రయ్య అని నామకరణమూ జరిగేయి.

"ఇదేమిటి ప్రభూ! నిన్ను నమ్మినవాడికి ఇదా శిక్ష?" అని విలపించాడు గాంగేయుడు.

దివి అంటే ఆకాశం. అందులోంచి ఉత్పత్తి అయిన మాటే దైవము. దివి మీంచి పడుతున్న ఉరుములు, మెరపులతో కూడిన పిడుగుల దాటికి మానవులు తట్టుకో లేకపోయరారు. హోరున గాలివానలు వచ్చేవి. పంటలు నాశనమయేవి. తామూచనిపోయేవారు. తమ శత్రువెవరో దివి మీదనుండి తమ పైకి దండయాత్ర చేస్తున్నారని మానవులు భావించారు. క్రూరమృగాల బారినుండి తమను తాము రక్షించు కుందుకి తయారు చేసుకున్న రాతి ఆయుధాలను దివిమీదికి విసిరారు. అవి తిరిగి కిందపడిపోయేవి. దివి మీద వున్న మహాశక్తివంతుడెవరో తమ రాతి ఆయుధాలను కిందకు నెట్టివేస్తున్నాడని వారు భావించారు. భూమికి గల ఆకర్షణ శక్తివల్ల ఆ రాతి ఆయుధాలు కిందపడుతున్నాయని తెలియజెప్పడానికి న్యూటన్ ఆనాడు వాళ్ళమధ్యలేడు.

అంచేత దివిమీదున్న ఆ శక్తి వంతుణ్ణి మనం జయించలేం కనుక అతనితో చెలిమి చేసుకోవడమే అవసరమని మానవులు భావించారు. అతనికి చేతులు జోడించారు. కానీ అతను కనబడలేదు. మానవుల ప్రార్థనా సౌలభ్యానికి, దివిమీదున్నాడని తాము భావించిన ఆశక్తి వంతుడికి ఒక ఆకారం సృష్టించారు. ఆ ఆకారం తమకు ఆనాడు అందుబాటులో వున్న రాళ్ళపై చెక్కేరు. అలా అలా రానురాను కొన్ని కోట్ల ఆకారాలు 'దివి'జులు అన్న పేరుతో సృష్టించబడ్డాయి. అలా సృష్టించబడిన ఆకారాలలో ఒకటి, తిరుమలలో వున్న వేంకటేశ్వరాకారం. ఆ వేంకటేశ్వరాకారాన్నే గాంగేయుడు నిత్యం మననం చేస్తూండడం వల్ల గాంగేయుడికి ఆ వేంకటేశ్వరాకారం నిదురలో కనిపించినట్టయి, తనకు బోధచేసినట్టయింది.

"ఓయ్ గాంగేయం! నీ భక్తికి నేను మెచ్చలేదు. కారణం ఏమంటావా? దేశంలో వున్న గుప్త ధనాధిపతుల్ని, గుత్త పెట్టుబడి దారుల్ని, స్మగ్లర్లనీ, ఇతరత్రా మానవుల బలహీతల్ని ఆసరాగా చేసుకుని వారిని దోచుకుంటున్న థగ్గులు, పిండారీలవంటి వ్యాపారస్తుల్ని రక్షిస్తున్నాననే అపప్రథ నాకు వుంది. వాళ్లు అనేక విధాల దోచుకున్న, దాచుకున్న డబ్బుని, చూస్తూ చూస్తూ ప్రభుత్వానికి పన్ను కట్టక, అనాథ శరణాలయాలకు

ఇవ్వలేక, నా హుండీలో పడేస్తుంటారు. పాపం! పాపపు డబ్బు పునీతం అవుతుందని వారి భ్రమ!

అలాగే నువ్వు దొంగ పాసుమీద ప్రయాణం చెయ్యడాన్ని కూడా నేను సమర్థించలేను. నన్ను దర్శింపగోరేవారు సక్రమ పద్ధతుల ద్వారా రావాలి తప్ప, అక్రమ పద్ధతుల ద్వారా రావడాన్ని నేను సమర్థించలేను. డబ్బు సర్దుబాటు కాకపోతే రావడం మానేయ్. అంతే కాని తప్పుడు పద్ధతులు అవలంబించకు! అదీకాక, నేను సర్వాంతర్యామిననే దృష్టి గలవారు నన్ను చూడ్డానికి రానవసరం లేదు. అలా రావడం వారి అజ్ఞానానికి నిదర్శనం."

భక్త గాంగేయుడు కళ్లు విప్పే సరికి వేంకటేశ్వరాకారం నిరాకారం అయింది. భక్త పరమాణువు మెదడులో అణుబాంబు పేలినట్టయింది!

**1/11/1979 ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక**